# ఎవరికి పిచ్చి?



కె. రామలక్ష్మి

'శాంథోమ్‌లో పిచ్చివాళ్ళెక్కువ'' అంది కల్పకం.

'కాదు. శాంథోమ్‌లో అంతా పిచ్చివాళ్ళే!' అంది లత గలగల నవ్వేస్తూ. అసలు లత నవ్వకుండా మాట్లాడ్డం నే నెప్పుడూ చూడలేదు.

లత పూర్తి పేరు స్వతంత్రలత. పంజాబీలు. దేశవిభజన రోజుల్లో

కాంక్షికులుగా పడరానిపాట్లు పడి ఎలాగో కాలూని నిలబడ్డ కుటుంబం వాళ్ళది. లత పెద్దకూతురు. మెరుపుతీగలాగా సన్నగా చెలాకీగా వుండడమేకాదు – పారే సెలయేరు లాగా – వసంతంలో కోయిల లాగా – గల గల లాడుతూనే వుంటుంది. కుహు కుహు లాడుతూనే వుంటుంది. క్లాసులో కూడా ఎప్పుడూ అంతే. లెక్చరరు తిట్టినా చక్కగా నవ్వేసి వూరుకునేది. పొగిడినా నవ్వేసి వూరుకునేది. మేం అంతా ముద్దుగా పిచ్చిలతా అని పిలిచేవాళ్ళం.

లతకి విడిగా జోకులు అక్కర లేదు. ఎదుటివాళ్ళు మాట్లాడే ప్రతి మాటకి విపరీతార్థం లాగి పగలబడి నవ్వగలదు!

'బాగుంది, కొంతమంది వింతగా వుంటారు. వింతగా ప్రవర్తిస్తారు. అంతమాత్రంచేతపిచ్చివాళ్ళుకారు'. అంది చాలా కామ్‌గా శాంత.

శాంతకేసి ఓసారి గుర్ మనిచూసి 'ఈ శాంత ఎప్పుడూ యింతే; అందరికీ ఒకలాతోస్తే తనకింకోలా తోచిందంటుంది.... వాళ్ళ నాన్నకి చెప్పి పేరు మార్చమంటాను' అంది నవ్వుతూ.

'ఏం, పేరుకీ – అలోచనలకి సంబంధం వుంటుందంటావాలతా?' కుతూహలంగా అడిగాను. చేపపిల్లలాగా లత కళ్ళు మిలమిల మెరిశాయి; నాకేసి కొంటెగాచూసింది.

'మీ ఉషచూడు, ఉష్! అన్నంత నిశ్శబ్దంగా వుంటుందా? మీ కల్పకం చూడు, కళకళ లాడుతూ వుంటుందా? మీ శాంత చూడు, శాంతి శాంతి శాంతి! అన్నట్టు వుంటుందా? నేను చూడు లత లాగా – అందులోనూ స్వతంత్ర లత లాగా అలా అల్లుకుపోతూనే వున్నాను – మీ చుట్టూ' అంది.

'ఇక్కడికి నిన్ను తీసుకు వట్టుకు ప్రాకులాడుతునట్టు' అన్నాను చిరు కోపంతో.

'అదిగో .... ముద్దుగా మలక్ష్మి' అంటూ అమాంతం నన్ను కౌగలించుకుంది. ఉష ముఖం పక్కకి తిప్పుకుని వస్తున్న నవ్వుని అపుకొంది 'మంచిపనైంది' అన్నట్టు దొంగ చూపులు చూస్తూ వూరుకుంది కల్పకం. పాపం!– శాంత కిలాంటి 'అభిమాన ప్రదర్శన'చూస్తే కొంచెం చికాకు.

'నాన్సెన్స్. పబ్లిక్ ప్లేసులో అలాచేస్తె నలుగురూచూస్తే ఏమనుకుంటారు?' అంది కసిరినట్టు.

'చూడకపోతే పరవాలేదా?' కొంటెగా అడిగింది లత.

ఇంతలో సర్వర్ తెచ్చిన ఐస్

క్రీమ్ అందరికీ నద్దుతున్నాడు. మేం ఇలా రెగ్యులర్ కస్టమర్స్ కావడం వల్ల వాడికి మా గురించి బాగా తెలుసు.

'ఓ అమ్మాయిగారు రాలేదేమండి?' అనుమానంగా అడిగాడు.

లత వాడిని ఆట పట్టించాలని 'నువ్వెవర్ని అడుగుతున్నట్టు?' అంది.

వాడు సిగ్గుపడిపోయాడు. వాడెవరి గురించి అడుగుతున్నాడో మా అందరికీ తెలుసు. మార్గరెట్ గురించి. మార్గరెట్ జాఫ్నా అమ్మాయి. కాలేజీ హాస్టల్లో వుండి చదువుకుంటుంది. సిలోన్ అమ్మాయిల కుండే సహజమైన చలాకితనం మూర్తీభవించి వుంటుంది మార్గరెట్‌లో. ముద్దుగా 'మాగీ' అంటాం మేం. క్లాసు ఎగ్గొట్టినా, పాఠం వినకూడదనుకున్నా, ఎవరో ఒకరు మాగీకి కన్నుగీటితే చాలు - ఇంకా రోజుకి క్లాసు సాగనిచ్చేది కాదు. పాపం! మదర్ వెరోనికా షేక్స్‌ఫియర్ చెప్తుంటే - ప్రాణాలు తీసేసేది - ప్రశ్నలువేసి. అసలే విరక్తిగావుండే మదర్ యింకా విరక్తిగా అయిపోయి ఒక్కొక్కప్పుడు చిన్నపిల్లలా చేతికున్న జీసస్ బెండు నెర్వస్‌గా తిప్పుతూ - కిటికీలోంచి ఎక్కడికో చూస్తూ పాఠం చెప్పాలని ప్రయత్నించేది! అంత అల్లరికీ ప్రతిబింబం మార్గరెట్. శనాది వారాలు మాలో ఎవరితోనో గడవడానికి పర్మిషన్ తెచ్చుకొనేది.

'మార్గరెట్ గురించేనా?' సర్వరుని అడిగింది లత.

వాడు తలూపాడు. అంతా గొల్లున నవ్వేం, అక్కడికి వాడూ మాగీ బోయ్‌ఫ్రెండు అయిపోయినట్టు. వాడింక అక్కడ నిలబడకుండా వెళ్ళిపోయాడు.

మేం తినడం అయిపోయింది. లేకుంటే లత ఏ తెల్లకాగితమో మడిచి 'నీకు ఉత్తరం పంపించింది' అని వాడికిచ్చేదే!

ఐస్‌క్రీమ్ పార్లర్ దాటి బీచ్ కేసి బయలుదేరాం, కాస్సేపు కూర్చుని చీకటిపడుతూంటే .... అప్పుడప్పుడే వస్తున్న తారలకేసీ, వెండి జలతారులా చీకట్లో సహితం మెరిసే సముద్రంకేసీ చూచి వద్దామని.

'నిజమే కాంతా, లత చెప్పినట్టు కాంథోమ్‌లో ఎందుకో పిచ్చివాళ్ళు ఎక్కువగా కన్పిస్తారు?' అన్నాను సగం స్వగతంగా.

మెట్లుదిగి ఇసకలో నడుస్తున్నాం బిషప్ బంగాళాలోంచి దీపాలవెలుగు యింకాపోనిలేతఎండలో కలిసి దూరంలోంతోండికా.చేఇ

చెట్టినాడ్ పేలస్ అద్దాల కిటికీలు — వేయి యింద్రధనుస్సులు ఒక్కసారి విరిసినట్టు వన్నెలు చిమ్ముతున్నాయి. పచ్చిరాని చీకట్లలో బీచి అంతా గమ్మత్తుగా వుంది.

'నిజంగానే నాకూ తెలియదు లక్ష్మీ, కాని యిక్కడి పిచ్చివాళ్ళు ఎవరినీ యిబ్బంది పెట్టరు' అంది శాంత. అంతా యిసకలో కూల బడ్డాం.

చూస్తూండగా సముద్రంమీదనుంచి భూమ్మీదకి చీకటి తెరవాలుతోంది.

బిషప్ బంగళా ప్రహారీగోడ దగ్గిర ఏదో గోల వినిపించి అంతా ఒక్కసారి వెనక్కి తిరిగాం.

దూరంగా లీలగా గోలగా ఆకృతులు కనిపించుతున్నాయి. గొంతుకలు వినిపిస్తున్నాయి.

'అబ్బాయిలూ—అమ్మాయిలూ.... అలవాటే!' అని లత ఓ క్షణం నిశ్శబ్దంగా వూరుకుంది.

'అదేం? అలా సీరియస్ అయిపోయావు?' అంది ఉష.

'ఉష్. విను. ఆ అమ్మాయెవరో గట్టిగా మాట్లాడుతోంది. ఫ్రెండ్స్ కాదేమో' అంది అనుమానంగా.

అంతా చెవులు రిక్కించి ఏం జరుగుతుందో వినాలని ప్రయత్నించాం.

అమ్మాయి గట్టిగా వాదిస్తూంది. చక్కని కంఠస్వరానికి అంతకంటే చక్కని ఇంగ్లీషు జోడించి వాదిస్తోంది. అబ్బాయిల మాటలు వినబడ్డం లేదుగాని, వాళ్ళేం చేస్తున్నారన్నదామె మాటలనుబట్టి గ్రహించడం కష్టంకాదు.

'స్టూపిట్' అంటూంది. 'రాయి వేస్తావా? నువ్వంత ఉన్నతుడివా? జీసస్ ఏమన్నాడు? తొలిరాయి ఎవర్ని విసరమన్నాడు?' నవ్వింది గొంతు. ఆ నవ్వు ఎంతో మృదువుగా వుంది.

'ఏయ్! డోన్టు కమ్ నియర్. నా సంగతి నీకు తెలియదు. నేను చీమకి కూడా హాని చెయ్యను. అయితే మటుకు, నన్ను చంపవచ్చిన గోవుని చంపేస్తాను!' అంది గంభీరంగా.

'మైగాడ్! కిల్ ది కౌ దట్ కమ్స్ టు కిల్ యు' ఏం వేదాంతం మాట్లాడుతోంది! ఫిలాసఫీ స్టూడెంటయి వుంటుందా?' అనుమానంగా అంది లత.

'ఆ పి.పి ఆఫ్ డబ్లియు.సి.సి. అయివుంటుంది' అంది కల్పకం. ఆ రోజుల్లో మా కాలేజీకి మించిన కాలేజీ లేదని, వున్నా అక్కడంతా పోజురాయుళ్ళని మాఘనవిశ్వాసం; అందుకే అందరికి ఏదో పేరుపెట్టి ఆనందించేవాళ్ళం. పి. పి. అంటే 'ప్రౌడ్ పీకాక్' అని!

'రండి మనం కొంచెం అటు నడిస్తే... ఆ కుర్రవాళ్ళు పారిపోతారు' అంటూ లేచింది లత.

మేం అంతాలేచి మట్టి దులుపుకుని అమ్మాయి మాటలు వినిపిస్తున్న వేపు నడిచాం.

మమ్మల్ని చూసింది కాబోలు-మాకేసి నడిచిరావడం మొదలు పెట్టిందా అమ్మాయి.

కొంచెం దగ్గిరనుంచి చూస్తే మాకు నవ్వొచ్చింది. ఆ కుర్రవాళ్ళు కాలేజీ అబ్బాయిలు కారు. అక్కడి గుడిసెల్లో పిల్లలు, ఓ ఐదారుగురు కలిసి పాపం ఏడిపిస్తున్నారు,

మేం రాడంచూసి కాలికి బుద్ధి చెప్పారా కుర్రాళ్ళు. ఆ అమ్మాయి కూడా తల విదిలించుకుంటూ మాకేసి వచ్చింది.

చూడ్డానికి బాగుందా అమ్మాయి. తెల్లనిచీర, దానిమీద తెల్లటి చేతులేనిరవికె; గాలికెగురుతున్న పావ్డ్ జుట్టు.... కళ్లు బాగున్నాయి; ఆ చీకట్లో మెరుస్తున్నాయి.

మా దగ్గిరగా వచ్చి, మమ్మల్ని నచ్చి పల్కరించలేదు. ఎటో సముద్రంలోకి చూస్తూ నణుగుతోంది.

కల్పకం లతని మోచేత్తో పొడిచింది.

'హాయ్' అంటూ పులకరింపుగా ఓ అడుగు ముందుకి వేసింది లత.

'ఎస్?' అందా అమ్మాయి-ప్రశ్నార్థకం మాటలోనే ధ్వనిస్తూ.

'ఇల్లరి పిల్లలు. ఈ ప్రాంతంలో ఎప్పుడూ యింతే. మనం కూడా గుంపుగావుంటే ఏమీ అనలేరు. కాని మీలా ఒంటరిగా వస్తే ఓ ఆట పట్టిస్తారు' అంది నవ్వుతూ.

ఆ అమ్మాయి బదులునవ్వలేదు. కాని లతకేసి తీక్షణంగా చూసింది, మీరెవరన్నట్టు.

లత చాలా యిరుకున పడ్డట్టు ముఖం పెట్టింది.

'వుయ్ ఆర్ ఫ్రమ్‌స్టెలా' అంది-దాన్లోనే అంత అర్థం యిమిడివున్నట్టు.

అమ్మాయి దంతాలు ముత్యాల్లా మెరిసేలా నవ్వింది.

'నే నెక్కడినుంచీ కాదు ....' అంటూ తన దారిన తను నడిచి వెళ్ళసాగింది.

మేం అంతా అయోమయంగా చూడ్డం చూసి 'ఉట్టి తలపొగరు!' అంది కసిగా లత.

'ఏం కాదు, ఏం చెప్పమన్నావేం' అంది శాంత.

'ఏం? తనెక్కడ చదువుకుంటూందో, ఏ హాస్టల్లో వుందో చెప్తే ఏంపోయిందట?' కోపంగా అంది లత.

'పోనిద్దూ, మనం హాయిగా

కూర్చోక' అంది కల్యాణం మళ్ళీ యిసకలో కూలబడుతూ.

అంతా కూర్చున్నాం మళ్ళీ. సరదా చచ్చింది.

'ఏదో ఉద్ధరిస్తున్నాం– మనదగ్గిర కూర్చునికాస్సేపు బాతాఖానీకొడుతుంది అనుకున్నాం' అంది ఉష.

'మరే! ఉడుకుమోత్తనం వచ్చి వుంటుంది– ఏ అబ్బాయో వస్తానని రాలేదు కాబోలు... అలా మండిపడి పోతోంది!' అంది లత.

బాగా చీకటి పడింది; జనం గుంపులు గుంపులుగా లేవడం కన్పిస్తూంది. ఇంతదూరం నుంచి వాళ్ళని చూస్తూంటే నీడల్లా వున్నారు.

'మనం పోదాం. చాలా పని వుంది. పొలిటిక్స్ ఎస్సేస్ ప్రిపేరు చేయాలి' అన్నా నెమ్మదిగా.

'అహా! అక్కడికి మాకేం పని లేనట్లు. రేపటికి టాక్సుమీదపాఠం ప్రిపేరు చేయకపోతే మిస్సు ముఖం మాడ్చుకుంటుంది' అంది ఉష.

'జ్ఞాపకం చెయ్యకండి. బాగీని తగిలిస్తేనరి' అన్నా.

శాంత మాట్లాడకుండాకూర్చుంది. దూరరలో ఎవరోటార్చి వేస్తున్నారు. 'బ్రూట్స్. అసలు మర్యాద లేదు' అంది అది చూసి.

'ఎవరికోసమో తా చూస్తుండొచ్చు బహుశా ఆ అమ్మాయి ఫ్రెండేమో' అన్నా.

అంతా లేచాం.... మెల్లిగా మెట్లు కేసి నడక ప్రారంభించా.

టార్చి వేసి వెతుకుతున్న ఇద్దరు పెద్దమనుషులు మా వెనక గబగబ వస్తున్నారు.

'ఆడపిల్లలం. ఒక్కళ్ళం కూర్చున్నామని చూసివుంటారు వెధవలు. అల్లరి చేద్దామని' అంది లత.

ఇంతట్లో ఓ పెద్దమనిషి మమ్మల్ని కలుసుకుని 'ఇక్కడ ఎవరేనా అమ్మాయిని చూశారా?' అని చాలా మర్యాదగా అడిగాడు.

లత గుర్ మని చూసింది. కాని శాంత 'ఏం? ఎందుకు?' అని అడిగింది.

'మేం చాలాసేపణ్నుంచీ వెతుకుతున్నాం. మెట్లుదిగి యిటువస్తూంటే చూశాం అన్నారు కొందరు. కాని ఎక్కడా కనిపించలేదు' అన్నాడు.

'తెల్లగా అందంగా వుంటుందా! పొట్టి క్రాపుకదూ! మంచి ఇంగ్లీషు మాట్లాడుతుందా?' లత అడిగింది.

'ఎస్. కరెక్టు. ఆమే. మీరు చూశారా? ఎటు వెళ్ళింది' ఆత్రంగా అడిగాడాయన.

లత ఓ క్షణం తటపటాయించింది; నాకు తెలియదని ఎక్కడఅంటుందో అని చాలా భయంవేసింది నాకు.

'అలా బీచి ఒడ్డునే నడిచి వెళ్ళిందండీ - అడయారు కేసి....' అన్నా.

'చాలా సేపయిందా ?' భయంగా అడిగాడు.

'లేదు. ఓ పదినిముషాలు' అంది కామ్‌గా శాంత.

'థాంక్యూ. సిస్టర్స్ థాంక్యూ' అంటూ నడవబోయి ఆగాడు.

మా ముఖాలమీద అనుమానం గుర్తించినట్టున్నాడు. 'ఆమె నా సోదరి. పిచ్చిది. ఎలా తప్పించుకుందో - గదిలో లేదు. సాయంత్రం నుంచి వెతుకుతున్నాం' అన్నాడు.

'పిచ్చిదా ?' అనుకోకుండానే అందరినోటా వచ్చిందా ప్రశ్న.

'అవును. పిచ్చిది. ఎం. ఎ. పాసయింది. కాని ఏం లాభం ? మతి భ్రమించింది' అన్నాడాయన బాధగా.... టార్చివేసి దారిచూస్తూ బీచంట పరుగెత్తడం ప్రారంభించారు - రాణీ రాణీ అని కేకలు వేస్తూ.

'పిచ్చిదా ? ఎంత చక్కగా మాట్లాడుతోంది. అంత అందంగా వుంది. నేను నమ్మలేను' అంది ఉష.

'షైగాడ్ - కిల్ ది కౌ దట్ కమ్స్ టు కిల్ యు' పిచ్చిదాని మాటలా ఇవి ! గీతావాక్యాలు కాని !' అంది లత.

శాంథోమ్ బీచ్ దాటి మెట్లెక్కి చర్చిదాటినా - రూంలో - ఎవరూ ఒక్కమాటైనా మాట్లాడితే ఒట్టు.

---


సచిత్ర, రాజకీయ, సాహిత్య, వైజ్ఞానిక, కళారంగాల
పక్షపత్రిక
శోభ
ఎడిటర్: సువర్ణశ్రీ
విడిప్రతి 25 పైసలు, సాలు చందా ప్రత్యేక సంచికతో రూ 6 లు
వింతలూ, విశేషాలతో ప్రతీ ఇంట, ప్రతివారి చెంత, విలసిల్లుతున్న శోభకు వెంటనే చందాదార్లుగా చేరండి ! ఏజంట్లు లేనిచోట ఏజన్సీ ఇవ్వబడును.

వివరాలకు :- ఎడిటర్ : శోభ
పోర్టుగేట్, రాజమండ్రి-1.